క్లుప్తంగా

ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న ఆర్గనైజేషన్‌ సభ్యులు

కొత్తపట్నం: మదర్‌ థెరెస్సా హెల్పింగ్‌ ఆర్గనైజేషన్‌ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఒంగోలు నుంచి కొత్తపట్నం వెళ్లే ప్రయాణికులకు వాహనాలను ఆపి చల్లటి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆటోలు, ద్విచక్రవాహనాలు, ఇతర వెహికల్స్‌ ఆపి చల్లటి మజ్జిగ ఇచ్చారు. అల్లూరులో సీనియర్‌ వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ నాయుకుడు, మాజీ వీఆర్వో వీరేపల్లి రామచంద్రారెడ్డి మజ్జిగ ప్యాకెట్లు నిమిత్తం సొంత నగదుతో సుమారు 250 మందికి మజ్జిగ ప్యాకెట్లు అందించారు. ఆర్గనైజేషన్‌ సభ్యులకు, వీరేపల్లి రామచంద్రారెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. డి.కేశవ, ఎం.సునీల్‌, ఎం.శరణ్య, ఎం.విద్యారణ్య, డి.రజిత్‌, ఎం.ప్రేమ్‌ కుమార్‌, ఎం.ప్రసాద్‌, సన్నీ రాజ్‌కుమార్‌ పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతరలో మహిళల కోలాటం

కురిచేడు: మండల కేంద్రంలోని శ్రీ పోలేరమ్మ జాతర సందర్భంగా పాకనాటి రెడ్ల బజారు మహిళలు కోలాటం ప్రదర్శించారు. అమ్మవారి ఆలయానికి మొక్కుబడి ప్రభను బజారు ప్రజలు నిర్మించి ఆలయానికి మంగళవాయిద్యాలతో బయల్దేరారు. దానికి మహిళలు తమ కోలాట ప్రదర్శన నిర్వహించి అందరినీ అలరించారు. ఇటీవల కాలంలో వారు నేర్చుకున్న సంప్రదాయ కోలాట ప్రదర్శనను నిర్వహించి అందరి మన్ననలు పొందారు. ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కోలాట ప్రదర్శనలో మహిళలు చూపించిన ప్రతిభ ప్రతి ఒక్కరినీ ఆకర్షించింది.

రికార్డులు లేని వాహనాలు సీజ్‌

కురిచేడు: ఎస్పీ గరుడ్‌ సుమిత్‌ సునీల్‌ ఆదేశాల మేరకు స్థానికంగా శుక్రవారం ఎస్సై శ్రీకాంత్‌ ఆధ్వర్యంలో కార్డెన్‌ సెర్చ్‌ నిర్వహించారు. రికార్డులు లేని 10 వాహనాలను సీజ్‌ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్‌ మాట్లాడుతూ పరిచయం లేని వారి వద్ద వాహనాలు కొనుగోలు చేయవద్దని ప్రజలకు సూచించారు. ఎవరైనా అలా వాహనాలు అమ్మేందుకు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సీజ్‌ చేసిన వాహనాలను దర్శి మోటారు వాహనాల అధికారికి అప్పగించినట్లు ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. ఇళ్ల వద్ద ఉన్న వాహనాల నంబర్లు రికార్డు చేసుకున్నారు.ఎన్నికల ఫలితాల అనంతరం ర్యాలీలో పాల్గొనకూడదని సూచించారు. కార్డెన్‌ సెర్చ్‌లో దొనకొండ, త్రిపురాంతకం ఎస్సైలు సంపత్‌కుమార్‌, సాంబశివరావు పాల్గొన్నారు.

సేవలే కలకాలం గుర్తుంటాయి

- ఎస్పీ గరుడ్‌ సుమిత్‌ సునీల్‌
- పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు శుభాకాంక్షలు



పోలీసు కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోలు దిగిన ఎస్పీ

ఒంగోలు టౌన్‌: ఉద్యోగం చేస్తున్నప్పుడు చేసిన సేవలే కలకాలం గుర్తుండి పోతాయని, ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిచ్చేలా మంచి పేరు ప్రఖ్యాతులు తెస్తాయని ఎస్పీ గరుడ్‌ సుమిత్‌ సునీల్‌ అన్నారు. పోలీసు శాఖలో సుదీర్ఘకాలం విశిష్టమైన సేవలను అందించి పదవీ విరమణ చేసిన డిస్ట్రిక్ట్‌ స్పెషల్‌ బ్రాంచ్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న టీసీ కృష్ణయ్య, కనిగిరి పోలీసు స్టేషన్లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న షేక్‌ చాంద్‌ బాషా, రిజర్వ్‌డ్‌ ఆర్మ్‌ ఏఆర్‌ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న యస్‌. రామారావు, ఏఆర్‌ హెచ్‌సీ గంగాధర్‌ రావులను జిల్లా పోలీసు కార్యాలయంలో కుటుంబ సభ్యుల మధ్య శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని స్పష్టం చేశారు. పదవీ విరమణ చేసిన పోలీసులను, వారి నిబద్ధతను పోలీసు శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని చెప్పారు. పదవీ విరమణ చేసినప్పటికీ పోలీసు కుటుంబంలో సభ్యులుగానే కొనసాగుతారన్నారు. శేష జీవితం హాయిగా గడపాలని, పిల్లపాపలతో కలిసి సుఖంగా జీవించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఎలాంటి సహాయం కావాలన్నా పోలీసు శాఖ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఒకేసారి నలుగురు పోలీసులు పదవీ విరమణ చేయడంతో వారి కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఆ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎస్పీ గరుడ్‌ సుమిత్‌ సునీల్‌ వారితో హుషారుగా కలిసి పోయి ముచ్చటించారు. కుటుంబ వివరాలను అడిగి తెసుకున్నారు. వారి కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోలు దిగారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ సులోచన, ఎస్బీ ఇన్‌స్పెక్టర్‌ రాఘవేంద్ర, ఎలక్షన్‌ సెల్‌ సీఐ సూర్యనారాయణ, ఆర్‌ఐ రమేష్‌ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలినేనిని కలిసిన మడనూరు గ్రామస్తులు



హైదరాబాద్‌లో బాలినేని శ్రీనివాసరెడ్డిను కలిసిన మడనూరు గ్రామస్తులు

కొత్తపట్నం: ఈ నెల 13న జరిగిన సార్వత్రికల ఎన్నికల సరళి గురించి, మండలంలో వైఎస్సార్‌ సీపీకు ఓట్లు ఎన్ని వస్తాయని వాటి గురించి మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని హైదరాబాద్‌ తను నివాసంలో శుక్రవారం మడనూరు గ్రామస్తులు మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీకు మెజార్టీ ఓట్లు వస్తాయని బాలినేనికు వివరించారు. అత్యధికంగా మడనూరు గ్రామంలో 1,000 ఓట్లు మీకు వస్తాయని, మహిళలు అధికంగా ఫ్యాన్‌ గుర్తుకు ఓట్లు వేశారని వివరించారు. బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో మనకు మంచి మెజార్టీ రాబోతుందని చెప్పారు. ఏపీలో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి రాబోతుందని వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారని వివరించారు. పేద ప్రజలకు మేలు జరుగుతుందని, పథకాలన్నీ చెప్పిన విధంగా అమలు చేస్తాడని పేర్కొన్నాడు. బాలినేని శ్రీనివాసరెడ్డిను కలిసిన వారిలో ఎస్టీ సెల్‌ జిల్లా సెక్రటరీ కట్టా శ్రీనివాసులు, చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు అడిగోపుల లక్ష్మీనారాయణ, పిట్ల ఏడుకొండలు, కట్టా వీరప్రతాప్‌ ఉన్నారు.

హరిహర క్షేత్రంలో శిద్దా వివాహ వార్షికోత్సవం



హరిహరక్షేత్రంలో కేకు కట్‌ చేస్తున్న శిద్దా అభిమానులు



స్వామివారిని దర్శించుకున్న శిద్దా దంపతులు

చీమకుర్తి: మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి వివాహ వార్షికోత్సవాన్ని వారి అభిమానుల ఆధ్వర్యంలో శుక్రవారం చీమకుర్తి హరిహర క్షేత్రంలో నిర్వహించారు. కేకు కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. తొలుత హరిహర క్షేత్రంలోని సకల దేవతలకు శిద్దా రాఘవరావు దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గోల్డెన్‌ గ్రానైట్‌ మేనేజర్‌ గిరి, ఆలయ ఇన్‌చార్జి ఎం.వెంకటేశ్వర్లు, వాసవీ మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న శిద్దా దంపతులు

ఒంగోలు: మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌ దర్శన సమయంలో వీరు స్వామివారిని దర్శించుకోగా వీరికి వేద పండితులు, ఆలయ అధికారులు వేద ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందించారు.

కౌన్సెలింగ్‌ షెడ్యూలు విడుదల చేయాలి

ఒంగోలు: ఎయిడెడ్‌ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్‌ షెడ్యూలు విడుదలచేయాలని ఏపీ టీచర్స్‌ గిల్డ్‌ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్‌ ప్రభాకర రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. జిల్లాలోని 24 ఎయిడెడ్‌ పాఠశాలల్లో పదిమంది.. అంతకంటే తక్కువగా విద్యార్థులు ఉన్న పాఠశాలలకు చివరి విడత నోటీసుగా డీఈఓ గురువారం నోటీసులు జారీ చేశారు.

హత్యాయత్నం కేసు దర్యాప్తు

కురిచేడు: మండలంలోని బోదనంపాడులో శుక్రవారం ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణ చివరకు హత్యాయత్నానికి దారితీసింది. ఈ సంఘటనలో అబుదావలి అనే వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలులోని కిమ్స్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్‌ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరి దగ్గరలో నున్న సీసీ టీవీ ఫుటేజిని పరిశీలించారు. అనంతరం గ్రామంలో విచారించి కేసు నమోదు చేశారు. అబుదావలిని బీర్‌ బాటిల్‌తో కొట్టిన వేమా గోవింద రమేష్‌ పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు.

108 మద్యం బాటిళ్ల పట్టివేత

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో ఎస్సై సంపత్‌ కుమార్‌ శుక్రవారం అకస్మిక దాడి చేసి 108 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. చందవరంలో బద్వేడు గ్రామానికి చెందిన కాశయ్య వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 65 మద్యం సీసాలను ఎస్సై సంపత్‌ కుమార్‌ తన సిబ్బందితో అకస్మికంగా దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. అలాగే దొనకొండ బస్టాండ్‌ కేంద్రంలో మల్లంపేట గ్రామానికి చెందిన వడ్లమూడి రమణయ్య వద్ద అక్రమంగా ఉన్న 43 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జగన్‌ సీఎం అయ్యేలా ఆశీర్వదించు శివయ్యా..

పుల్లలచెరువు: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ పార్టీ అత్యధిక సీట్లు గెలిచి సీఎంగా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అయ్యేలా ఆశీర్వదించు శివయ్యా.. అంటూ వైఎస్సార్‌ సీపీ పుల్లలచెరువు మండల సోషల్‌ మీడియా సభ్యులు శుక్రవారం శ్రీశైలంలోని శ్రీశైల మల్లికార్జున భ్రమరాంభ స్వాముల వారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. పుల్లలచెరువు మండల సోషల్‌ మీడియా సభ్యులు మూడు రోజులుగా పుల్లలచెరువు నుంచి శ్రీశైలం పాదయాత్ర చేపట్టారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యేగా తాటిపర్తి చంద్రశేఖర్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని స్వామి వారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. సభ్యుడు చెన్నయ్య మాట్లాడుతూ ఎండలను సైతం లెక్క చేయకుండా తమ మొరను ఆలకించి ఆశీర్వదించాలని స్వామి వారికి మొక్కలు తీర్చుకున్నట్లు తెలిపారు. జె.చెన్నయ్య, బి. నరసింహారావు, ఎం.కోటయ్య, పి.నాగరాజు, పి.నరసయ్య, కె. వెంకటనారాయణ, పి.బ్రహ్మానాయక్‌ పాల్గొన్నారు. సభ్యులను పార్టీ నాయకులు అభినందించారు.

జగన్‌ సీఎం కావాలంటూ మొక్కుకున్న జయకుమార్‌



మోకాళ్ల మీద కొండ ఎక్కుతున్న కావూరి జయకుమార్‌

ఒంగోలు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాజా ఎన్నికల్లో మరో మారు ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ నాగులుప్పలపాడు మండలానికి చెందిన కావూరి జయకుమార్‌ శుక్రవారం గుణదల మేరీమాతకు మొక్కుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కొండ దిగువ నుంచి మేరీ మాత దర్శనం వరకు మోకాళ్లపై కొండ ఎక్కారు. 2019 నుంచి 2024 వరకు జగన్‌మోహన్‌రెడ్డి పాలన పూర్తిగా పేదవాని ఆనందానికి నెలవై ఉందన్నారు సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, సామాజిక న్యాయం, చట్టం సక్రమ మార్గంలో నడిపించడం , ఇవన్నీ అంబేడ్కర్‌ కలలు కన్న విధానంలో ఉన్నాయని కావూరి జయకుమార్‌ పేర్కొన్నారు. జూన్‌ 4న జరగనున్న కౌంటింగ్‌లో కూడా సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అయ్యేలా చేయాలని మేరీమాతను కోరుకున్నట్లు తెలిపారు.


కలాం సేవా సంస్థ హెల్త్‌ కార్డుల పంపిణీ



హెల్త్‌ కార్డులను పంపిణీ చేస్తున్న కలాం సేవా సంస్థ

ఒంగోలు టౌన్‌: నగరానికి చెందిన డాక్టర్‌ ఏపీజే అబ్దుల్‌ కలాం సేవా సంస్థ శుక్రవారం గోపాల నగర్‌లోని కార్యాలయంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎస్‌ఎం సుభాని హెల్త్‌ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒంగోలులోని 21 కార్పొరేట్‌ , ప్రైవేటు ఆసుపత్రుల్లో కార్డు హోల్డర్లకు ఓపీ లేకుండా వైద్య సేవలను అందించే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ సంస్థ ఇప్పటి వరకు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించిందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని తెలిపారు. ఆల్‌ఈజ్‌వెల్‌ అధ్యక్షుడు శ్రీనివాసరావు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, పట్టణ అధ్యక్షులు మోటే భాస్కర్‌, పాస్టర్‌ డేవిడ్‌, నజీరుద్దీన్‌, సందానీ, నరసింహారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి



వెన్న, డ్రై ఫ్రూట్స్‌ అలంకరణలో వీరాంజనేయ స్వామి

ఒంగోలు మెట్రో: వైశాఖమాసం హనుమజ్జయంతి మహోత్సవాల్లో భాగంగా స్థానిక కోర్టు సెంటర్‌ మాతా శిశు వైద్యశాల ద్వారకా నగర్‌ వెలసియున్న వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు వైఖానస ఆగమోక్తముగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు వీరాంజనేయ స్వామికి మన్యసూక్తంతో పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేకంగా చేసిన వెన్నతో డ్రై ఫ్రూట్‌ అలంకరణ తో స్వామికి ధూప దీప హారతులతో అర్చనాధి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రదోషకాలంలో వీరాంజనేయ స్వామికి అష్టోత్తర శతనామావళి తమలపాకులతో మల్లెపూలతో అర్చన భక్తిశ్రద్ధలతో హనుమాన్‌ చాలీసా పారాయణం, భక్తుల చేత శ్రీరామ నామ సంకీర్తనం నిర్వహించారు. ఈ పూజ క్రతువులో ఉభయ దాతలుగా పోకూరి వెంకట సుబ్బారావు, శ్రీనివాసులు, ఆలపాటి రాధాకృష్ణమూర్తి సుభాషిని దంపతులు, ఆత్మకూరి రంగనాథం శారదా దంపతులు తన్నీరు కాటంరాజు వెంకట శేషమ్మ దంపతులు వ్యవహరించారు. దేవస్థానం భక్త బృంద సభ్యులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కోదండరామ స్వామి కల్యాణం

పామూరు: మండలంలోని లక్ష్మీనరసాపురం గ్రామంలో శ్రీకోదండరామస్వామి ఆలయంలో సీతా, రాముల దేవతా ఉత్సవ మూర్తుల కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు కొల్లూరి రవికిరణ్‌శర్మ మొదట సీతా, రామ, లక్ష్మ, హనుమంతుని మూల విగ్రహ మూర్తులకు పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం సీతా రాముల పంచలోహ విగ్రహమూర్తులను మేళతాళాల నడుమ గర్భాలయం వద్ద నుంచి కల్యాణవేదికకు తరలించి వేదమంత్రాల నడుమ వైభవంగా శాంతి కల్యాణం నిర్వహించి అనంతరం ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయంవద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్‌ గాజులపల్లి ధనలక్ష్మి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, పోలు సుధాకర్‌రెడ్డి, దేవస్థాన కమిటీ, భక్తులు పాల్గొన్నారు.

పశువులకు వేసవి దెబ్బ

- నిర్లక్ష్యం వహిస్తే మరణించే ప్రమాదం
- పోషణ చర్యలపై అవగాహన ఉండాలి
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పశు వైద్యులు

పెద్దారవీడు: వేసవిలో మనుషులతో పాటు పశువులు కూడా వడదెబ్బకు గురవుతాయి. పశుపోషణలో నిర్లక్ష్యం వహిస్తే వడదెబ్బ తగలడం ఖాయం . పశుపోషణ చర్యలు, చికిత్స తదితరాలను పశువైద్యాధికారి బాలునాయక్‌ వివరించారు. పగటి పూట ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకుపైగా నమోదవుతుండటంతో రైతులు అవగాహనతో పశు సంపదను జాగ్రత్తగా కాపాడుకోవాలని పేర్కొన్నారు. ఉష్ణోగ్రత పెరిగి గాలిలో తేమ తగ్గినప్పుడు పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి. గాలి ప్రసరణ సరిగా లేని ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో కిక్కిరిసి ఉంచినప్పుడు, నీటి సౌకర్యం అందుబాటులో లేనప్పుడు పశువులు అధిక శ్రమకు గురై వేడి గాలులు తాకిడికి లోనైనప్పుడు వడదెబ్బకు గురవుతాయి. తెల్లజాతి పశువుల కంటే నల్లజాతి పశువులు ఎక్కువగా వడదెబ్బకు లోనవుతాయి.

నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం

బయటి ఉష్ణోగ్రతలు పశువుల శరీర ఉష్ణోగ్రతల కంటే ఎక్కువైనప్పుడు మెదడులోని హైపోథలామస్‌ స్వేద గ్రంథుల నిర్వహణపై పర్యవేక్షణ కోల్పోతుంది. ఆ సందర్భాల్లో చర్మంపై స్వేచ్ఛ గ్రంథులు చెమట అధికంగా ప్రసారం చేసి పశువులకు అధిక ఉష్ణోగ్రతలకు లోను కాకుండా కాపాడతాయి. అదే సమయంలో చెమట ద్వారా శరీరంలోని ఎలక్ట్రోలైట్స్‌ కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. దీని వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడి వేగం పెరుగుతాయి. మూత్రపిండాలు సక్రమంగా పని చేయక పోవడం వల్ల మూత్ర విసర్జన కుంటుపడుతుంది. పశువుల ఆరోగ్య పరిస్థితి విషమించి అపస్మారక స్థితిలోకి పోయి శ్వాస ఆడక చనిపోతాయి. పశువుల ఆరోగ్య పరిస్థితి గుర్తించి వెంటనే చికిత్స అందించాలి.

లక్షణాలు

వడదెబ్బ తగిలిన పశువుల శరీర ఉష్ణోగ్రత 108 డిగ్రీ పారన్‌ హీట్‌ కంటే ఎక్కువగా ఉంటుంది. చర్మం సున్నితత్వం కోల్పోయి గట్టి పడుతుంది. నోటి వెంట సొంగ పడుతుంది. పశువులు సరిగా నడవలేక తూలుతూ పడుకోవడానికి ప్రయత్నిస్తాయి. నీటి కోసం చెట్ల కిందకు చేరుతాయి. శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీలు దాటితే శ్వాస పీల్చుకోవడం కష్టమవుతుంది. ఫిట్స్‌ లక్షణాలతో పశువులు క్రమంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణిస్తాయి. శరీర ఉష్ణోగ్రత 105 నుంచి 108 డిగ్రీలు దాటితే ప్రాణాపాయం సంభవిస్తుంది. వడదెబ్బ వల్ల చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పశువులో పునరుత్పత్తి ప్రక్రియ కుంటుపడి తాత్కలిక వ్యంధత్వం సంభవిస్తుంది. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గి పోతోంది.

చల్లని ప్రదేశంలో కట్టేయాలి

పశువు వడదెబ్బకు గురైందని గుర్తించిన వెంటనే రైతులు పశువులను నీటిలో కడిగి చల్లని గాలి వీచే ప్రదేశానికి మార్చాలి. పశువుల శరీర ఉష్ణోగ్రతను గమనించి ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరే వరకు పలుమార్లు నీటితో కడగాలి. వెంటనే సమీపంలోని వెటర్నరీ అసిస్టెంట్‌ను సంప్రదించి తగిన చికిత్స చేయించుకోవాలి.

నివారణ చర్యలు

- పశుపోషకులు మేలైన యాజమాన్య పద్ధతులు, పోషణ విషయంలో శ్రద్ధ తీసుకుంటే వడదెబ్బ నుంచి పశువులను రక్షించుకోవచ్చు. వేసవిలో పగటి వేళల్లో మేత కోసం బయటకు వదల కూడదు. ఉదయం, సాయంత్రం చల్లగా ఉండే సమయాల్లో మాత్రమే బయట తిరగనివ్వాలి. తాగునీటిని ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలి.
- పశువులను రోజు మూడుసార్లు శుభ్రమైన నీటితో కడగాలి. నాటుజాతి పశువుల కంటే సంకరజాతి పశువులు త్వరగా వడదెబ్బకు గురవుతాయి. చెరువులు, కుంటలు ఉంటే పశువులను అందులో ఈదనివ్వాలి.
- వెలుతురు, గాలి బాగా ప్రసరించేలా ఎతైన పశువుల శాలను గడ్డితో నిర్మించుకోవాలి. వడగాలి తగలకుండా గోనె సంచులు కప్పాలి.
- మురుగు నీరు, కలుషిత నీరు తాగకుండా చూసుకోవాలి. పరిశుభ్రమైన నీటిని తాగేలా ఏర్పాటు చేయాలి.

కష్టాల ఊబిలో నిమ్మ

హనుమంతునిపాడు: తగ్గిన నిమ్మ ధరతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది నిమ్మకు ధర ఆది నుంచి ధరలు ఎగుడు దిగుడుగా ఉన్నాయి. ప్రస్తుతం తీవ్ర ఎండలు కాస్తున్నా ధర పెరగ లేదు. కనిగిరి మార్కెట్‌లో కిలో రూ. 25 నుంచి రూ. 30 మించి ధర పలకడం లేదు. హనుమంతునిపాడు మండలానికి జిల్లాలోనే నిమ్మ సాగుకు పేరు ఉంది. అధికారుల లెక్కల ప్రకారం మండలంలో నిమ్మ సాగు 1500 హెక్టార్లలో ఉంటుంది. కానీ లక్షలు పెట్టు బడి పెట్టి పండించిన కాయకు కనీసం గిట్టుబాటు ధరరావడం లేదు. వ్యాపారులు కిలో రూ. 25 నుంచి రూ. 30 మించి ధర రానీయడం లేదని రైతులు చెప్తున్నారు. వ్యాపారులు కొనుగోలు చేసిన కాయను బెంగళూరు, చెన్నై, హైదరాబాదు, ముంబై తరలిస్తారు. అక్కడ మార్కెట్‌ వ్యాపారులు కొనుగోలు చేయడం లేదనే సాకుతో రూ. 25 మించి ఇవ్వడం లేదని రైతులు చెప్తున్నారు. కోత కూలీలు, ఆటో చార్జీలు కూడా రావడం లేదని కౌలు దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనిగిరి వ్యాపారుల వద్దకు తీసుకొచ్చిన కాయలకు ఆటో చార్జీలు కూడా వెళ్లడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిమ్మ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించండి

సింగరాయకొండ: మండల ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మాగుంట సుబ్బరామిరెడ్డి కాలనీ, గ్రామ పంచాయతీ కార్యాలయం రోడ్డు ప్రాంతాల్లో ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్‌ మసూద్‌అలీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. శరీరానికి చెమట పట్టకపోవటం, శరీర ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటం, వణుకు పుట్టడం , మగత నిద్ర కలవరింతలు రావడం లాంటివి వడదెబ్బ లక్షణాలుగా గుర్తించాలన్నారు. వడదెబ్బ లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా పిల్లలు, బాలింతలు, గర్భిణులు, వృద్ధులు రోడ్లపై తిరగరాదని చెప్పారు. ప్రజలు తెల్లనిదుస్తులు, తలపాగా ధరించి మాత్రమే రోడ్లపైకి రావాలన్నారు. వడదెబ్బను తట్టుకోవాలంటే ముఖ్యంగా ఉప్పు కలిపిన మజ్జిగ, చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్‌ ద్రావణం, ఓఆర్‌ఎస్‌ ద్రావణం తాగాలని సూచించారు. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి నీరు తాగించకూడదని వీలైనంత త్వరగా వైద్యుని వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. ఏఎన్‌ఎం నాగమణి, నసీమున్‌, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలకే పింఛన్ల నగదు

కురిచేడు: పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాలకు జూన్‌ నెల పింఛన్లు వేస్తున్నట్లు ఎంపీడీఓ సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 సచివాలయాల పరిధిలో 4,942 పింఛన్లు ఉన్నాయన్నారు. వాటిలో డీబీటీ ద్వారా 3810 మంది పింఛనుదారులకు వారి బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. మిగతా 1132 మంది పింఛన్‌దారులకు నాన్‌ డీబీటీ ద్వారా ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని చెప్పారు. పింఛన్‌దారులు సహకరించాలని ఆయన కోరారు.

హనుమత్‌ జయంతి వేడుకలకు ముస్తాబైన ఆలయాలు

సీఎస్‌పురం (పామూరు): వైశాఖ మాసం బహుళ దశమిన వచ్చే హనుమజ్జయంతి వేడుకలకు మండలంలోని హనుమంతుని ఆలయాలు ముస్తాబయ్యాయి. మండల కేంద్రమైన సీఎస్‌పురంతోపాటు మండలంలోని సి.నాగులవరం, కంభంపాడుతో పాటు పలు ఆలయాలు వేడుకలకు ముస్తాబయ్యాయి.

వైభవంగా సీతారాముల పట్టాభిషేకం

కొనకనమిట్ల: స్థానిక రామదూత క్షేత్రంలో శుక్రవారం సీతారాముల పట్టాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ద్వాదశ శ్రీరామ నామ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా శ్రీవైకుంఠ సీతారామచంద్రస్వామికి రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకటరామ కృష్ణాచార్యులు ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, అర్చనలు చేశఋరు. కల్యాణ ఉభయదాతలుగా చినమనగుండం, పొదిలికి చెందిన గొంట్లా కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఉత్సవాలను గ్రామ ప్రజలతోపాటు పరిసర గ్రామాల ప్రజలు తిలకించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శనివారం దీక్ష ముగింపుతో పాటు పంచముఖ వీరాంజనేయస్వామి ఆలయంలో ఆకుపూజ, సర్వదేవతా దర్శనం, రాత్రికి గ్రామోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ నిర్వాహకులు యక్కంటి తిరుపతిరెడ్డి, గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి, వెలిశెట్టి వెంకటనారాయణ, వి.వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

పోలీసుస్టేషన్‌ ఆకస్మిక తనిఖీ

గిద్దలూరు రూరల్‌: ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు ఎస్పీ హిమంత్‌ శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్కాపురం , యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాలకు ప్రత్యేక అధికారిగా ఆమెను ఎన్నికల కమిషన్‌ నియమించింది. అందులో భాగంగానే ఆమె పోలీసుస్టేషన్‌ను సందర్శించి 4వ తేదీన కౌంటింగ్‌ సమయంలో ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారనే విషయాల పై పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 144 సెక్షన్‌ అమలులో ఉంటుందని, ప్రజలు సహకరించేలా చూడాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునేలా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలని ఆమె సూచించారు. పోలీసులు అప్రమత్తంగా మెలగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట సీఐ వైపీ సోమయ్య, ఎస్సై తోట వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కొనకనమిట్ల: ఎన్నికల కౌంటింగ్‌ రోజున అందరూ ప్రశాంతంగా ఉండాలని, గ్రామాల్లో అల్లర్లు సృష్టించి గొడవలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై మాధవరావు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని గార్లదిన్నె గ్రామంలో రాజకీయ పార్టీల నాయకులతోపాటు ప్రజలతో సమావేశాలు నిర్వహించి శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. పలు వాహనాలను తనిఖీ చేశారు. ఆయన వెంట పోలీస్‌ సిబ్బంది ఉన్నారు.

రేపటి నుంచి మోపాడు గంగా భవాని తిరునాళ్ల

పామూరు: మండలంలోని మోపాడు రిజర్వాయర్‌ వద్దగల గంగాభవానీ ఆలయంలో శ్రీగంగాభవానీ అమ్మవారి తిరునాళ్ల ఈనెల నెల 2వ తేదీ ఆదివారం నుంచి 6వ తేదీ గురువారం వరకు ఐదు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ తెలిపింది. తిరునాళ్లలో భాగంగా రేపు 2వ తేదీ ఆదివారం నిలుపు, 3, 4వ తేదీలు సోమ, మంగళవారాల్లో అమ్మవారి గ్రామోత్సవం, 5వ తేదీ బుధవారం అమ్మవారి జలదిస్నానం, గావు, రాయభారం, 6వ తేదీ గురువారం బండ్లు పొంగళ్లు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

బైక్‌ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

పీసీపల్లి: బైక్‌ అదుపుతప్పి ఇరువురికి గాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. బుడ్డారెడ్డిపల్లికి చెందిన గుంటగాని వినోద్‌, గుంటగాని నరేంద్రలు పెదయిర్లపాడు నుంచి పీసీపల్లికి వస్తుండగా వరిమడుగు వద్ద బైక్‌ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు కావడంతో వైద్యం నిమిత్తం ఒంగోలు ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

పొగాకు అత్యధిక ధర రూ.335

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శుక్రువారం నిర్వహించిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ.335 పలికింది. కట్టుబడిపాలెం గ్రామానికి చెందిన రైతులు 644 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 566 కొనుగోలయ్యాయి. కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.278.82 పలికింది. వేలంలో మొత్తం 41 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.